విశాలాంధ్ర
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు జిల్లా



# ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలి

- రూ.16 వేల గిట్టుబాటు ధరను కొనసాగించాలి
- రైతులకు బకాయిలు వెంటనే చెల్లించాలి
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం
- సీపీఐ, రైతు సంఘం నాయకులు ధ్వజం

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** దళారులు, మిల్లర్ల ప్రమేయం లేకుండా ప్రభుత్వమే నేరుగా వరి ధాన్యాన్ని గిట్టుబాటు ధరకే రైతుల వద్ద కొనుగోలు చేయాలని సీపీఐ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శులు దామా అంకయ్య, ఎస్.కె. షాన్ వాజ్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యం బకాయిలు రైతులకు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉందన్నారు. దళారుల, మిల్లర్ల జోక్యంతో ధాన్యానికి గిట్టుబాటు ధర అందడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.16 వేల గిట్టుబాటు ధర రైతులకు దక్కడం లేదన్నారు. రైతులు ఎంతో వ్యయ, ప్రయాసలతో ధాన్యాన్ని పండిస్తున్నారన్నారు. పంట చేతికొచ్చిన అనంతరం ధాన్యానికి గిట్టబాట ధర దక్కుతుందని రైతు ఎంతో ఆశగా ఉంటాడని తెలిపారు. తీరా పండించిన ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు అమ్మే సమయంలో ధాన్యం నాణ్యతతో లేదని, పలు రకాల సాకులతో గిట్టుబాటు ధరను తగ్గిచేస్తున్నారని ఆరోపించారు. గిట్టుబాటు ధర కన్నా తక్కువగా సుమారు రూ.7 వేల నుంచి రూ.9 వేల వరకు( పుట్టి వరి ధాన్యం) కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గిట్టుబాటు ధర కన్నా తక్కువ ధరలకే ధాన్యాన్ని రైతులు అమ్ముతున్నారని, పలువురు రైతులు వాపోతున్నారని తెలిపారు. ఈ పద్ధతిలో రైతు తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్మినప్పటికీ పూర్తిస్థాయిలో నగదు రైతులకు అందడం లేదన్నారు. దీంతో ధాన్యం అమ్మకాలకు సంబంధించి రైతులకే ప్రభుత్వం బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే గడిచిన సుమారు 2, 3 సంవత్సరాల నుంచి ప్రభుత్వం రైతులకు బకాయిలు ఇవ్వాల్సి ఉందన్నారు. కొండాపుర మండలం, సాయి పేట గ్రామం రైతు వెంకటేశ్వర్లుకు ప్రభుత్వం ధాన్యం బకాయిలను సుమారు మూడు సంవత్సరాల నుంచి చెల్లించాల్సి ఉందని ఆరోపించారు. ఈ బకాయిల కోసం రైతులు సంబంధిత అధికారుల విన్నవించినప్పటికీ ఫలితం శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న దాన్యం బకాయిలను ప్రభుత్వం రైతులకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా రైతులు వరి ధాన్యం పండించేందుకు తగు సాగునీరు ఉందన్నారు. రైతులకు ధాన్యం బకాయిలు ఆగిపోవడంతో ఇతర పంటలైన మిరప, పెసలు, వేరుశనగ, మినుము తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారన్నారు. ఈ సీజన్లో రైతులు వరి పంట పండిం చేందుకు ఆసక్తి చూపటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలలో వరి ధాన్యం రైతులు అధికంగా పండించినప్పటికీ ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ రైతులకు భరోసా కల్పిస్తున్నారని, మన రాష్ట్రంలో వరి పంట పై ప్రభుత్వం పరిమితి పెట్టడం ఎంతవరకు సబబు అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం గతంలో రెండుసార్లు తగలబడి పలు ఫైలులు బూడిద పాలయ్యాయన్నారు. ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నప్పటికీ ఈ ఒక్క కార్యాలయమే తగల బడడం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత జిల్లా అధికారులు మిల్లర్లను, రైతు సంఘాల నాయకు లను, రైతులను సమావేశం నిర్వహించి రైతు సమస్యల పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం రైతులకు భరోసా కల్పిస్తూ వరి ధాన్యాన్ని నేరుగా కొనుగోలు చేసి, పెండింగ్ లో ఉన్న ధాన్యం బకాయిలను రైతులకు తక్షణమే చెల్లించి, పలు రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి నందిపోగు రమణయ్య, సీపీఐ కార్యవర్గ సభ్యులు ఎస్ డి. సిరాజ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు ఎన్.రమణయ్య, ఎస్ కె.మున్నా, పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## టెక్ మహీంద్ర కు 63 మంది విద్యార్థులు ఎంపిక

**విశాలాంధ్ర - కావలి:** బహుళ జాతి సాఫ్ట్ వేర్ కంపెనీ టెక్ మహీంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణంలోని ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల లో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ప్లేస్ మెంట్స్ లో 63 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎమ్మెస్సార్ కళాశాల విద్యార్థులు 55 మంది ఎంపిక కాగా, 8 మంది ఇతర కాలేజీ విద్యార్థులు ఎంపికయ్యారు. దాదాపు 450 మంది విద్యార్థులు వివిధ కళాశాల నుండి ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. గ్రూప్ డిస్కర్షన్, హెచ్ఆర్ రౌండ్లు నిర్వహించిన తరువాత 63 మంది విద్యార్థులను కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు వెంటనే నియామక పత్రాలను అందజేశారు. ప్రస్తుతం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు తమ డిగ్రీ పూర్తి అయిన వెంటనే చేరవచ్చని, ఇప్పటికే డిగ్రీ పూర్తి అయిన విద్యార్థులు ఒక వారం రోజుల్లో చెన్నై లోని తమ కంపెనీ లో చేరవచ్చని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. ఒక మంచి బహుళ జాతి కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పించిన కళాశాల కరస్పాండెంట్ రాజ్ కుమార్ చౌదరి కి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, ప్రిన్సిపాల్ తల్లపనేని ఉమ, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ప్లేస్ మెంట్ ఆఫీసర్ సుకుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం

**విశాలాంధ్ర- వలేటివారిపాలెం:** పిడిఎఫ్ తరపున ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని మండల కేంద్రంలో సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నిరంతరం రైతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలపై పోరాడే పిడిఎఫ్ తరపున గ్రాడ్యుయేట్ అభ్యర్థి గా పోటీచేస్తున్న మీగడ. వెంకటేశ్వరరెడ్డి ని, టీచర్స్ అభ్యర్థి గా పొక్కిరెడ్డి. బాబురెడ్డి ని మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ కాలనీ తోపాటు చిన్న పాలెం లో ఇంటింటికి తిరుగుతూ, ఓటర్లు ను కలుస్తూ కరపత్రాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సిఐటియు జిల్లా నాయకులు జీవీబీకుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు మాదాల రమణయ్య, సిఐటియు మండల కార్యదర్శి సాదు చెన్నకేశవులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు దాసరి తిరుమలరావు, కెవిపిఎస్ నాయకులు నేలకూరి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాందీ షాపులో నగదు గల్లంతు

-బీసీ కాలనీ బ్రాందీ షాపు లో ఎక్సైజ్ ఎస్సైలు దర్యాప్తు

**విశాలాంధ్ర -మనుబోలు:** మనుబోలు పంచాయతీ కోదండరాంపురం బీసీ కాలనీలో ప్రభుత్వ మద్యం దుకాణంలో సుమారు 6లక్షలు గల్లంతయింది. అదే సమయంలో అక్కడ పని చేసే సేల్స్ బాయ్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఎక్సైజ్ ఎస్సైలు రంగంలోకి దిగారు. శనివారం శివరాత్రి ఆదివారం సెలవు రెండు రోజులు బ్యాంకులకు సెలవు కావడంతో ఆ నగదు సోమవారం బ్యాంకులో జమ చేయాల్సి ఉంది. సోమవారం 11(నేడు) గంటలకు ఎక్సైజ్ ఎస్సైలు అక్కడ పని చేసే సేల్స్ బాయ్ అదృశ్యమైనట్లు తెలిసింది సేల్స్ బాయ్ కి ఫోన్ చేయగా తన భార్యకు బాగా లేక నెల్లూరులో ఉన్నానని నేను వచ్చి కడతానని చెప్పినట్లు సమాచారం. ప్రస్తుతం సూపర్వైజర్ ని ఎక్సైజ్ ఎస్ఐ లు టెన్షన్ లో ఉన్నారు. దీనిపైన విచారణ చేపట్టారు. ఇటీవల కాలంలో ఇలాంటి సర్వ సాధా రణంగా మారాయని స్థానికులు గుసగుస లాడుకుంటున్నారు. మనుబోలు మండల మీడియా ప్రతినిధిలు అడగ గా సాయంత్రం వివరాలు తెలియజేస్తామని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేయడం గమనార్హం.

## భూహక్కు రీ సర్వే పనులు వేగవంతం చేయండి: కమిషనర్

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం నిర్వహణలో భాగంగా నగర వ్యాప్తంగా రీ సర్వే పనులను వేగవంతం చేయాలని కమిషనర్ హరిత ఆదేశించారు. శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం నిర్వహణపై కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలతో సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సచివాలయ అడ్మిన్, ప్లానింగ్, రెవెన్యూ సెక్రెటరీలను సమన్వయపరచి రీ సర్వే పనులను పూర్తి చేయాలని సూచించారు. నగర వ్యాప్తంగా ఉన్న అన్ని అసెస్మెంట్ నెంబర్లను అడ్మిన్ సెక్రెటరీలతో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించి వారి లాగిన్ ల ద్వారా సిడిఎంఏ పోర్టల్ లో అప్లోడ్ చేయించాలని కమిషనర్ ఆదేశించారు. అవసరమైన సమాచారం అందించడంలో వార్డు ప్లానింగ్ సెక్రెటరీలు, వార్డు రెవెన్యూ సెక్రటరీలు అడ్మిన్ కార్యదర్శులకు సహకరించేలా పర్యవేక్షించాలని కమిషనర్ సూచించారు. నిర్దేశించిన గడువులోగా రీ సర్వే పనులను పూర్తి చేసి సమగ్ర సమాచారాన్ని ఆన్లైన్ లో పొందుపరచాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.నగర వ్యాప్తంగా ప్రతీ భవనాన్ని పన్ను పరిధిలోకి తీసుకొచ్చి, డిమాండ్ నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న పారిశుధ్య నిర్వహణ పనుల యూజర్ చార్జీల వసూళ్ళపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్ సూచించారు. పన్ను వసూళ్ళలో సచివాలయ అడ్మిన్ కార్యదర్శులకు వారాంతపు లక్ష్యాలను నిర్దేశించాలని, లక్ష్యాలు పూర్తి చేయనివారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులంతా కార్పొరేషన్ ఆదాయం పెంచేందుకు కృషి చేయాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, తహసీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ లు, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

## సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు అవగాహన

**విశాలాంధ్ర- లింగ సముద్రం :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మరియు కందుకూరి శాసనసభ్యులు మానుగుంట మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన నూతనంగా నియమించబడిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన కార్యక్రమం సోమవారం ఉదయం లింగసముద్రం మండలంలోని అన్ని బోయిన పల్లె, సాయంత్రం చిన్న పవనిలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నూతనంగా నిర్మించబడిన సచివాలయ కన్వీనర్లు, గృహసారధులకు సచివాలయ కన్వీనర్ కోఆర్డినేటర్ వరి కోట కృష్ణారెడ్డి పార్టీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన కార్యక్రమం కాబట్టి ప్రతి ఒక్కరు 2024 వ సంవత్సరం జనరల్ ఎలక్షన్స్ వస్తున్నాయి మరలా జగన్మోహన్ రెడ్డిని, మహిధర్ రెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత గృహసారథులు కన్వీనర్లపైన ఎంతో ఉందని ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలు స్టిక్కర్ అంటించి వారి నుంచి మంచి రెస్పాన్స్ వచ్చేటట్లు చూసి వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాల్సిన ప్రభుత్వ పథకాలు రాని ఇంటికి వచ్చేటట్లు చేసే బాధ్యత మీ మీద ఉంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తిరుపతి రెడ్డి,దగ్గు వెంకటేశ్వర్లు,బత్తిన మధు,అన్ని బోయిన పల్లె సచివాలయ కన్వీనర్ చీమల శీను అన్ని బోయిన పల్లె ఎంపీటీసీ చంటి చిన్న పవని, ప్రెసిడెంట్ దామా సీతారామయ్య పాల్గొన్నారు.

## శ్యామ్ ప్రసాద్‌రెడ్డికి ఫారం - ఎఎ, ఫారం -బిబి అందజేత

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో వైసిపి తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫారం - ఎఎ, ఫారం బిబి లను ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామ కృష్ణారెడ్డి , రీజనల్ కోఆర్డినే టర్, మాజీ మంత్రి, ఒంగోలు శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా పేర్నాటి శ్యాం ప్రసాద్‌రెడ్డి అందుకున్నారు. ఈనెల 22వ తేదీన నామినేషన్ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో అధికారకంగా ఫారం - ఎఎ, ఫారం బిబిలను శ్యామ్ ప్రసాద్ రెడ్డి అందుకున్నారు. ఇందుకు గాను సహక రించిన ముఖ్యమంత్రి కి, తూర్పు రాయలసీమకు సంబంధించి, మూడు జిల్లాల మంత్రులు, రాజ్యసభ సభ్యులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, జిల్లా పరిషత్తు చైర్మన్లు, జిల్లా పార్టీ అధ్యక్షులు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మేయర్లు మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు, కార్పొరేటర్లకు, కౌన్సిలర్లకు, సర్పంచులకు పేరుపేరునా శ్యామ్ ప్రసాద్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# గిరిజన కాలనీలను రక్షించండి

- కాలనీలకు దారులు మూసే రియల్ దందాను అరికట్టండి
- అంటరానితనం, కుల వివక్షను ప్రోత్సహించకండి
- ఆర్డీవో కు వినతిపత్రం అందజేసిన ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక

**విశాలాంధ్ర - కావలి :** ఎలాంటి సౌకర్యాలు లేని గిరిజన కాలనీలను రక్షించాలని, వసతులు కల్పించాలని ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం కావలి ఆర్డీవో వి.కే.శీనా నాయక్ ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ పట్టణంలోని కొన్నదిన్నె గిరిజన కాలనీ చుట్టూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా భారీ ప్రహరీ గోడలు నిర్మించారన్నారు. గిరిజన కాలనీ మెత్తం మూసివేసినట్లుగా భారీ ప్రహరీ గోడను నిర్మించారన్నారు. కావలి హరిజన వాడ చుట్టూ కూడా గోడను నిర్మిస్తున్నారున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ ప్రహరీ గోడ నిర్మాణానికి గిరిజనుల ఇళ్ళు కూడా ఇచ్చి వెళ్ళిపోవాలని ఇప్పటికే చాలా సార్లు బెదిరించారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి గిరిజన కాలనీ, గిరిజనులు అడ్డంగా భావించి భారీ ప్రహరీ గోడలను నిర్మించారన్నారు. దీని వలన వర్షాలు వస్తే ఖచ్చితంగా ముంపుకు గురి అవుతుందన్నారు. కాలనీ వరద నీటిలో ఉండాల్సి వస్తుందని, ఇప్పటికే గిరిజనులకు ఉన్న శ్మశానం బదులు ప్రక్కనే ఉన్న చెరువులో మృతదేహాలను పూడ్చాలని ఒత్తిడి తెచ్చారన్నారు. చెరువులో నిత్యం నీళ్ళు ఉండటం వలన వారు వారి మృతదేహాలను కూడా పూడ్చుకోలేని దుస్థితికి నెట్టారన్నారు. ఇది కుల వివక్షకు, అంటరానితనానికి ప్రత్యక్ష ఉదాహరణ అని, అమానుషమైన చర్య అన్నారు. నేటి ఆధునిక యుగంలో ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం బాధాకరమన్నారు. అక్రమ రియల్ ఎస్టేట్ వ్యాపారం, అక్రమ గ్రావెల్ తోలకం, భారీ గోడల అక్రమ నిర్మాణం అయినా చర్యలు ఉండక పోవడం దారుణమన్నారు. కావలి ముసునూరు ఇందిరమ్మ కాలనీ చుట్టూ కూడా భారీ ప్రహరీగోడను నిర్మిస్తున్నారని, ప్రహరీ గోడ నిర్మాణం వలన దారి మెత్తం మూసుకుపోతుందని, ఇందిరమ్మ కాలనీ వాసులు కావలిలోకి రావాలంటే దారి లేక చుట్టూ 3కి.మీ తిరిగి పోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే ఇందిరమ్మ కాలనీకి ముసునూరు నుండి దారి ఆక్రమణకు గురైందని, ప్రైవేటు ప్లాట్లు గుండా పోవాల్సి వస్తుందని, ఇక ఈ భారీ ప్రహరీ గోడ నిర్మాణం వలన ఇంకా దూరం పెరిగి పోతుందన్నారు. కావలి పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు, త్రాగునీటి సమస్యకు చర్యలు తీసుకోవాలని కోరుతు న్నామ న్నారు. కావలి పట్టణ జనాభాకు తగిన విధంగా కార్మికులు, సిబ్బంది లేరని, ఉన్న కార్మికుల మీదే ఎక్కువ భారం పడుతుం దన్నారు. కార్మికులను, సిబ్బందిని పెంచి పారిశుద్ధ్యం మెరుగు పర్చాలని కోరుతున్నామన్నారు. పట్టణంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొప్పోర్తి నాగరాజు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకుడు కరవది భాస్కర్, తెలుగుదేశం నాయకుడు జ్యోతి బాబురావు, సిపిఎం నాయకుడు పెంచలయ్య, జనసేన నాయకుడు పొబ్బా సాయి విటల్, పసుపులేటి మహేష్, ఎల్.శ్యామల, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## కోడి పందేల స్థావరాలపై దాడి

**విశాలాంధ్ర-మర్రిపాడు:** మండ లం ఇర్లపాడు గ్రామ సమీపంలో కోడి పందేల స్థావరాలపై ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడి నిర్వహించి కోడిపందెం ఆడుతున్న ఐదు గురు వ్యక్తులను వారి నుండి 11 కోళ్లను నాలుగు బైకులు ఐదు సెల్ ఫోన్ లను రూ.2,180.00 డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. సిఐ నాగేశ్వరావు తో పాటు ఈ దాడిలో స్థానిక ఎస్సై విశ్వనాథ్ రెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## పార్ట్ టైం రాజకీయాలకు నేను చాలాదూరం

- ఆత్మకూరులో ఆనం రామనారాయణరెడ్డి

**విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు:** తమ రాజకీయాలు ఎప్పటికీ ఫుల్ టైం గానేసాగుతాయని ఆనం 1983 వ సంవత్సరం జనవరి 9న ఎన్టీ రామారావు సారధ్యంలో ప్రత్యక్ష రాజకీయ రంగ ప్రవేశం చేశానని ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆత్మకూరులో ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగేతర శక్తులతో రాజ్యాంగాన్ని నడ పాలను కోవడం, పరిపాలనలో కాలయాపన చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థ కే గొడ్డలి పెట్టుఅని ఆనం అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో సంక్రమించిన శాసనసభ్యుల హక్కులను ఎవరూ హరించలేరన్నారు. రానున్న బడ్జెట్ సమావేశాల అనంతరం సరైన రాజకీయ నిర్ణయంతో ముందుకు సాగుతానని ఆనం అన్నారు.

# విద్యార్థులకు క్విజ్ పోటీలు

**విశాలాంధ్ర -కలువాయి :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కలువాయి సబ్ బ్రాంచ్ చైర్మన్ జి పెంచల పుల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్విజ్ ప్రాథమిక తరగతులు 1 నుండి 5వ తరగతి వరకు నిర్వ హించిన క్విజ్ పోటీల్లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కలువాయి వెస్ట్ స్కూల్ ప్రథమ స్థానంలో నిలువగా, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కలువాయి హరిజనవాడ స్కూల్ ద్వితీయ స్థానంలో స్థానంలో, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తిరుమల పాడు ఆఫ్ కొత్తూరు తృతీయ స్థానంలో నిలచాయి. ప్రాథమికోన్నత పాఠశాల లకు మండల స్థాయిలో నిర్వ హించిన రాత పరీక్షల్లో ప్రథమ ద్వితీయ స్థానాలనుస్థానాలను మండల ప్రాథమికోన్నత పాఠశాల పెన్నబద్దేలు యూపీ ఎస్ సి స్కూల్ గెలుచుకోగా చీపినాపి, కలువాయి హైస్కూల్ తృతీయ స్థానంలో నిలిచారు. గుణాత్మక విద్యలో భాగంగా నిర్వహించే ఈ క్విజ్ పోటీలలో అన్ని పాఠశాలలో పాల్గొనాలని విద్యార్థుల సమాధానాలు సంతృప్తిని ఇచ్చాయని తెలిపారు. కార్యక్రమం కు విచ్చేసిన కలువాయి సబ్ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు విద్య వైద్యం అభివృద్ధి పట్ల తమ సంస్థ ఇప్పుడు ముందంజలో ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలకృష్ణారెడ్డి బివిఎస్ ఆర్ జడ్పీ హైస్కూల్ కలువాయి ప్రధానో పాధ్యాయులు ఎస్ జనార్దన్ రెడ్డి, సిఆర్పిలు మహేష్ పాల్గొన్నారు.

## తారకరత్నకు ఘన నివాళులు

**విశాలాంధ్ర- నెల్లూరు:** నెల్లూరు సిటీ లో 47వ డివిజన్ లో గుప్తా పార్కు సెంటర్ లో సినీ నటుడు నందమూరి తారకరత్న చిత్ర పటానికి నగర టీడీపి అధ్యక్షులు ధర్మవరం సుబ్బారావు , స్థానిక మాజీ కౌన్సిలర్ ధర్మవరం సుజాతరావు , టీడీపి నాయకులు , కోర్యకర్తలతో కలసి పూలమాలవేసి నివాళులర్పించారు.

## మరోసారి సామాజిక న్యాయానికి పెద్దపీట వేసిన సీఎం

- బీద మస్తాన్ రావు

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** వైసీపీ ప్రకటించిన ఎమ్మెల్సీ అభ్యర్థులలో మొత్తం 18 స్థానాలకు బీసీలకు 11, ఎస్సీలకు 2, ఎస్టీ 1 ఎమ్మెల్సీ స్థానాలు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కేటాయించారని, దేశంలో సోషల్ ఇంజనీరింగ్ కాన్సెప్ట్ ను అమలు చేస్తున్న ఏకైక సీఎం జగన్ మోహన్ రెడ్డి అని రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు కొనియాడారు. సామాజిక అసమానతలు లేకుండా చేయడమే తన లక్ష్యం అంటూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారటీ వర్గాలకు సంక్షేమ పథకాలతోపాటు రాజకీయంగానూ అవకాశాలు కల్పిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి మన జగనన్నని తెలిపారు. బీద మస్తాన్ రావు మాట్లాడుతూ ప్రతి రంగంలో కూడా బిసీలకు పెద్ద పీట వేస్తూ బీసీలంటే వెనకబడిన వర్గాలు కాదు వెన్నుముక అంటూ వారి అభ్యున్నతికి మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు.మరోవైపు రాజకీయంగా ఏ అవకాశం వచ్చిన కూడా వైసీపీ బడుగు బలహీన వర్గాల వారికే ముందుగా ప్రాధాన్యత ఇస్తున్నదని బీద మస్తాన్ రావు తెలిపారు. బీద మస్తాన్ రావు మాట్లాడుతూ దేశంలో ఎన్నో సంవత్సరాలుగా ఎన్నో ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల అభివృద్దే తమ లక్ష్యం అంటూ ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తూ ప్రభుత్వాల్ని నడిపినా, నిమ్నవర్గాలకు ఎటువంటి ఉపయోగం కలుగలేదు. ఇప్పటికి కూడా వారు ఉన్న స్థాయిలోనే వున్నారంటే ప్రభుత్వాల చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చని అన్నారు.కానీ నిమ్న వర్గాల అభివృద్దే తన ధ్యేయం.బడుగు బలహీన వర్గాల పురోభివృద్దే రాష్ట్ర అభివృద్ధి అని భావించిన సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి తన నిర్ణయాన్ని చేతల్లో చూపిస్తూ బడుగు బలహీన వర్గాల కోసం సంక్షేమ పథకాలను ప్రకటించి మన అభ్యున్నతికి దోహదం చేశారన్నారు. ప్రతి రంగంలో నిమ్న కులాల వారు పోటీ పడేలా చేసారు. విద్య ఉపాధి రంగాల్లో వారికి ప్రత్యేక స్థానం కల్పిస్తూ మన అభ్యున్నతికి పాటుపడ్డారని బీద మస్తాన్ రావు కొనియాడారు.ప్రజాసేవలో కూడ బడుగు బలహీన వర్గాల వారికి అధిక ప్రాధాన్యత వుండాలని నిర్ణయించి ప్రతి ఎన్నికల్లో కూడా వారికి పెద్దపీట వేసారు. అవి పంచాయితీ ఎన్నికలైనా, ఉప ఎన్నికలైనా, జిల్లా పరిషత్ ఎన్నికలైనా, నామినేటెడ్ పోస్టుల్లోనైనా కూడా బడుగు బలహీన వర్గాల వారికే అధిక ప్రాధాన్యత ఇచ్చి మొత్తంగా 67 శాతం రిజర్వేషన్ వారికే జగన్ మోహన్ రెడ్డి ఇచ్చారని తెలిపారు.ముఖ్యంగా బీసీలకు 44 శాతం ప్రాధాన్యత కల్పించి, వారి ఉన్నతికి శ్రీకారం చుట్టారని బీద మస్తాన్ రావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ సామాజిక న్యాయాన్ని పాటించి ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనారిటీలకు ఎప్పుడు కూడా అండగా వుంటానని మరోసారి నిరూపించారు. 18 ఎమ్మెల్సీ స్థానాల అభ్యర్థుల్లో 14 మంది అభ్యర్థులు బడుగుబల హీనవర్గాల వారే కేటాయించారంటే సీఎం కి వారిపై ఉన్న ప్రేమని అర్థం చేసుకోవచ్చన్నారు. సోషల్ ఇంజనీరింగ్‌కి నిలువెత్తు నిర్వచనం ఎవరు అంటే సీఎంజగన్ మోహన్ రెడ్డి అనిదేశంలోని బడుగు బలహీన వర్గాలు కొనియాడుతున్నాయని అన్నారు. బీసీలు ముఖ్యమంత్రులుగా ఉన్న రాష్ట్రాల్లో కూడా ఈస్థాయిలో బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వలేదని బీద మస్తాన్ రావు అన్నారు.ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా స్థానిక సంస్థల అభ్యర్థుల కోటా కింద ఎమ్మెల్సీగా నిర్ణయించబడిన మేరుగ మురళీధర్ కి శుభాభినందనలు తెలిపారు.

# శరవేగంగా నెల్లూరు రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులు

## తాత్కాలిక కార్యాలయాల కోసం షెడ్ల నిర్మాణం పూర్తి

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** గ్రాండ్ ట్రంక్ రూట్‌లో ఉన్న నెల్లూరు రైల్వే స్టేషన్, అతి సుందరంగా ప్రపంచ స్థాయి సౌకర్యా లను కల్పించేందుకు రైల్వే స్టేషన్‌ల పునరాభివృద్ధి ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. రోజురోజుకు రైలు ప్రయాణికుల విని యోగ దారుల సంఖ్య పెరుగుతోంది. ఈ స్టేషన్ నుండి రోజుకు సుమారు 30 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే ఒక ప్రత్యేకత కల్గిన స్టేషన్ గా గుర్తింపు పొందిం ది. ప్రస్తుత, భవిష్యత్తు లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ అవసరా లకు అను గుణంగా తీర్చిదిద్దేందుకు ఈ స్టేషన్ లో మరింత ఉన్న త స్థాయి వసతులు కల్పించేందుకు ఈపిసి (ఇంజినీరింగ్ ,ప్రొక్యూర్మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో ఈ స్టేషన్ ను అభివృద్ధి పర్చేందుకు ప్రణాళికను రూపొందించారు. దక్షిణ మధ్య రైల్వే ఆగస్టు 2022లో ఎస్ సి ఎల్ ఇన్ఫ్రా టెక్ లిమిటెడ్ హైదరాబాద్ కంపెనీతో ఈ కీలకమైన పనిని చేపట్టేందుకు ఒప్పందం కుదుర్చు కున్నారు. ఈ పనులను 21 నెలల కాల వ్యవధిలో మే, 2024 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగం గా ఈ పనులు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన పనులు పురోగతి లో వున్నాయి. సైట్ కార్యాలయాలు, కాంక్రీట్ టెస్టింగ్ ల్యాబ్ పనికి సంబంధించిన సామగ్రిని భద్ర పరిచేందుకు తాత్కాలిక షెడ్‌ల నిర్మాణం పూర్తయింది. నెల్లూరు రైల్వే స్టేషన్ కు సంబంధించిన ప్రధాన మార్పులు, ఈ స్టేషన్ ను ఉన్నత స్థాయికి అభివృద్ధి పర్చేందుకు రూపొందించిన డిజైన్‌ను నిర్వహ ణ సంస్థ ఇదివరకే ఐఐటి-మద్రా స్ అధికారులు తనిఖీ చేసి డిజైన్ ను ఆమోదించింది. కోర్టు, జీఆర్పీ కార్యాలయాల తాత్కాలిక నిర్వహణ కోసం తాత్కాలిక షెడ్‌ల నిర్మాణం పూర్తి చేసి సంబంధిత శాఖలకు అప్పగించారు. 1వ నంబర్ ప్లాట్ ఫాంలో ఎనిమిది కవర్ ఓవర్ ప్లాట్ ఫారాల (సిఓపి) నిర్మాణా నికి సంబంధించిన దిమ్మెల నిర్మాణం, 2వ, 4వ ప్లాట్‌ఫాంలో ఒక్కొక్క టీ చొప్పున 4 దిమ్మెల నిర్మాణం పూర్తయింది. సిఓపి ఫాబ్రికేషన్ పనులు పురోగతిలో వున్నా యి. పాత కట్టడాలను కూల్చివేసి కొత్త నిర్మాణా లు చేపట్టేందుకు తవ్వకం పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులకు సంబంధించి నిర్మాణ సంస్థ 250 మెట్రిక్ టన్నుల స్టీల్‌ను కొను గోలు చేసింది. నెల్లూరు స్టేషన్‌లో ప్రారంభమైన పునరా భివృద్ధి పను లు బాగా పుంజుకున్నాయని ,పనులను ప్రతి దశలోనూ పర్య వేక్షిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి పనులను ప్రాధాన్య తా ప్రాతి పదికన చేపట్టామని, ఈ పనులను నిర్దీత గడువులోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

# ఏప్రిల్ నుంచి కోటంరెడ్డి ప్రజా ఆశీస్సుల యాత్ర

## 141 రోజుల పాటు సాగనున్న యాత్ర

**విశాలాంధ్ర బ్యూరో -నెల్లూరు:** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరో సుదీర్ఘ యాత్రకు సన్నద్ధమయ్యారు. అధికార పార్టీకి దూరంగా జరిగిన తర్వాత ప్రజల్లో మరింత బలపడటమే లక్ష్యంగా ఏప్రిల్ నుంచి ప్రజా ఆశీస్సుల యాత్రను ఆయన ప్రారంభించనున్నారు. ఈ మేరకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యా లయంలో ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశ మ య్యారు. యాత్రకు సంబంధించి పలు అంశాలను ఆయన ప్రస్తావించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. సుదీర్ఘంగా 141 రోజులు పాటు ఈ యాత్ర కొనసాగేలా ప్రణాళిక రూ పొందించారు. నెల్లూరు రూరల్ పరిధిలోని అర్బన్ ప్రాంతాల తో పాటు గ్రామీణాల ప్రాంతాల్లో కూడా ఈ యాత్ర కొనసాగనుంది. ఈ 141 రోజులు ప్రజల నివాసంలోనే భోజనం చేసి అక్కడే రూరల్ ఎమ్మెల్యే బస చేయనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ వేగవంతంగా రెడీ అవుతోంది. నెల్లూరు రూరల్ కు సంబంధించి వివిధ ప్రజా సమస్యలపై ఈనెల 25న ఆందోళన కార్యక్రమం, అనంతరం మార్చిలో ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి జాతర కార్యక్రమం ముగిసిన వెంటనే ఈ సుదీర్ఘ యాత్రకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీకారం చుట్ట నున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని 25వ డివిజన్ బుజబుజనెల్లూరు నుంచి యాత్రను ప్రారంభించనున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి బాగోగులు తెలుసు కోవడంతో పాటు వారి ఆశీస్సులను అందుకోవటమే లక్ష్యంగా ఈ యాత్ర కొనసాగ నుంది. దీర్ఘకాలిక ప్రణాళికను దృష్టిలో ఉంచుకొని నెల్లూరురూరల్ నియోజకవర్గంలో మరింత బలపడటమే లక్ష్యంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అడుగులు పడుతున్నాయి.

## బ్రాహ్మణపల్లిలో
# మాజీ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి మొదటి వర్ధంతి ఏర్పాట్లు

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** మేకపాటి గౌతంరెడ్డి వర్ధంతి సంద ర్భం గా మాజీ ఎంపీ మేకపాటి రాజ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి దగ్గర నుండి ఏర్పాట్లను పరిశీలించారు. గౌతమ్ రెడ్డి వర్ధంతి సందర్భంగా జిల్లాలోని పలువురి ప్రముఖులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ఆహ్వానించారు. జిల్లా ప్రజలతో ప్రత్యేక అను బంధం ఏర్పరచుకున్న మేకపాటి గౌతమ్ రెడ్డి అన్నయ్యకు తెలుగు రాష్ట్రాల్లో అభిమానించే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి తెలిపారు.

# మూలస్థానేశ్వర స్వామి రథోత్సవం

**విశాలాంధ్ర- నెల్లూరు సిటీ:** నెల్లూరు నగరంలోని మూలాపేటలోని శ్రీ భువనేశ్వరీ సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయం వద్ద రథోత్సవం సందర్భంగా నగర శాసన సభ్యులు డాక్టర్ పి. అనిల్ కుమార్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రథోత్సవాన్ని ప్రారంభించి, నగర ప్రజలందరూ సుఖ సంతోషాలతో అష్ట ఐశ్వర్యా లతో ఉండాలని ప్రార్థిస్తున్నా నన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయ చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి, ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనీల్ బాబు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# పీడీఎఫ్ తరఫున ఎమ్మెల్సీఎన్నికల ప్రచారం

**విశాలాంధ్ర- వలేటివారిపాలెం:** నిరంతరం రైతులు,ఉద్యోగులు ఉపాధ్యాయులు,కార్మికుల సమస్యలపై పోరాడే పిడిఎఫ్ తరపున గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా పోటీచేస్తున్న మీగడ. వెంకటేశ్వరరెడ్డిని, టీచర్స్ అభ్యర్థి గా పొక్కిరెడ్డి. బాబురెడ్డి కి మార్చి 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలలో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని కోరుతూ వలేటివారిపాలెం మండల కేంద్రంలో ఎస్ సీ , ఎస్టీ, బీసీ కాలనీ తోపాటు చిన్న పాలెం లో ఇంటింటికి తిరుగుతూ, ఓటర్లు ను కలుస్తూ కరపత్రాలను విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో సిఐటియు జిల్లా నాయకులు జీవీబీకుమార్, రైతు సంఘం జిల్లా నాయకులు మాదాల రమణయ్య సిఐటియు మండల కార్యదర్శి సాదు చెన్నకేశవులు జనవిజ్ఞాన వేదిక నాయకులు దాసరి తిరుమలరావు, కెవిపిఎస్ నాయకులు నేలకూరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# రూ. 70 లక్షలు వ్యయం..ఫలితం శూన్యం

## - ఆహ్లాదం ఆవిరి- నిరుపయోగంగా ఆట వస్తువులు,
## - ప్రమాదకరంగా విద్యుత్ తీగలు- ఇదీ మిట్టపాలెం పార్కు దుస్థితి

**విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్:** నెల్లూరు నగర ప్రజలకు ఆహ్లాదం పంచేందుకు నగరపాలక సంస్థ, నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (నుడా) భారీగానే నిధులు ఖర్చు చేస్తున్నాయి. అయితే ఆ నిధుల వ్యయం బూడిదలో పోసిన పన్నీరులా మారుతోంది. ఇందుకు ఉదాహరణ కార్పొరేషన్ పరిధిలోని 13వ డివిజన్ మిట్టపాలెం పార్క్ ప్రత్యక్ష సాక్ష్యం. మిట్టపాలెం లో 2021 డిసెంబర్ నెలలో పార్కు అభివృద్ధికి నగర శాసనసభ్యులు అనిల్ కుమార్ యాదవ్ శంకుస్థాపన చేశారు. ఇందుకోసం నుడా సాధారణ నిధులనుంచి సుమారు 70 లక్షల రూపాయలు మంజూరు చేసి పనులు కూడా ప్రారంభించారు. అయితే పార్కు ఒక రూపానికి వచ్చింది కానీ ఆహ్లాదం పంచడం లేదు. పార్క్ ఆలనా పాలన చూసేవారు కరువయ్యారు. మొక్కలకు నీళ్ల పట్టేందుకు బోరు ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ కనెక్షన్ ప్రమాదకరంగా మారింది. వైర్లు బయటకు వేలాడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎవరైనా ఆదమరిచి లోపలికి వచ్చి ఆ వైర్లను గాని తొక్కితే ప్రాణాలు గాల్లో కలిసిపోవడం ఖాయం. ఇక మొక్కల పెంపకం విషయానికొస్తే అక్కడ గడ్డి తప్ప ఏమి కనపడటం లేదు. వాకింగ్ ట్రాక్ వేసినా కూడా అది నిరుపయోగంగా ఉంది. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు తుప్పు పట్టిపో తున్నాయి. లక్షలు వ్యయం చేసి నిర్మించిన పార్కు నిరుపయోగంగా మారింది. ఆ పార్కునకు ఒక కాపలా దారును ఏర్పాటు చేసిన ఆయనకు ఎనిమిది నెలలుగా జీతం ఇవ్వకపోవడంతో ఆయన కూడా పట్టించు కోవడం మానేశాడు. దాంతో మిట్టపాలెం పార్కు పరిస్థితి అధ్వానంగా మారింది. పిల్లల ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట వస్తువులు కూడా నిరుపయోగంగా మారాయి. సాయంత్రం పూట ఆ పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మిట్టపాలెం పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి ఉపయోగం లోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

# రేషన్ పంపిణీలో అడుగడుగునా మోసం

## - ఇంటింటికి ఇవ్వాల్సిన బియ్యం ఒకే చోట ఇస్తున్న వైనం
## - జగనన్న ఆశయాలకు అడుగడుగునా తూట్లు

**విశాలాంధ్ర- నెల్లూరు:** రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటింటికి రేషన్ బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించి ప్రజలకు అందిస్తుంటే ఆ పంపిణీకి అడుగడుగునా ఎండీ యూ వాహనదారులు తూట్లు పొడుస్తున్నారు. కలిగిరి పరిధిలోని క్రిష్టా రెడ్డి పాలెం, గంగి రెడ్డి పాలెం, చిన్న అన్న లూరు పంచాయతి లోని గ్రామాలలో, మండలంలోని పలు పంచాయతీలోని తదితర గ్రామాలలో ఇంటింటికి పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యం ఎవరు లేని సమయంలో ఒక చోట ఆపుకుని ఇచ్చి వెళ్తున్నారు. ఎంతో మంది నిరుపేదలు రేషన్ బియ్యం అందక అవస్థలు పడుతున్నారు. ఆ రేషన్ బియ్యాన్ని దళారులకు బ్లాక్లో అమ్ముకొని రేషన్ పంపిణీ దారులు పబ్బం గడుపుకుంటుంన్నారు. వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి రేషన్ పంపిణీ చేస్తారని ముందుస్తూ సమాచారం అందించాల్సి ఉండగా ఎటువంటి సమాచారం లేకుండా ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియక రేషన్ లబ్దిదారులు ఆయెమ యంలో పడ్డారు. రేషన్ పంపిణీ దారులను అడిగితే ఒక సారి మాత్రమే వస్తాము. మీరు లేనప్పుడు. మేమేం చేస్తాము. రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలుసుకొని వచ్చి నప్పుడే ఎక్కడికి పోకుండా ఉండి తీసుకోవాలి తప్ప మీరు ఉన్నప్పుడు రావాలా ?' అంటూ ప్రశ్నంచారు. ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకుంటూ ప్రజలకు సేవా చేయాల్సి ఉండగా ప్రజల పైనే హుకుం జారీ చేసే వారి పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ వాళ్లు రేషన్ పంపిణీ విధానాన్ని పరిశీలించాల్సి ఉండగా ఎవరూ పరిశీలించిన దాఖలాలు లేవుని ప్రజలు చర్చించుకుంటున్నారు. రేషన్ బియ్యం పంపిణీలో బియ్యం, చక్కర, కందిపప్పు ఇవ్వాల్సి ఉండగా బియ్యం, చక్కర ఇచ్చి చేతులు దులుపుకుంటూన్నారు. అదేమిటి అని అడిగితే కంది పప్పు కొంచెం వచ్చాయి. కొంత మంది కి ఇచ్చామని చెబుతున్నారు. కొందరికి రావటం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రేషన్ పంపిణీ విధానంలో ప్రభుత్వ ఆశయాలు నేరవేరతాయో లేదో వేసి చూడాల్సి ఉంది.

# బిజెపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి ప్రచారం

**విశాలాంధ్ర-రాపూరు:** భారతీయ జనతా పార్టీ తూర్పు రాయలసీ మ పట్టభద్రుల ఎంఎల్ సి అభ్య ర్థిగా పోటీచేస్తున్న సన్నా రెడ్డి దయాకర్ రెడ్డి వెంకటగిరి నియోజక వర్గ బిజెపి ఇన్చార్జి ఎస్ఎ స్ఆర్ నాయుడు ఆధ్వర్యంలో రాపూరు లోని కరుణామయి స్కూల్ లో ,ప్రభుత్వ బాలుర పాటశాల యందు,మల్లమ్మ గుం ట ప్రాధమిక పాఠశాలలోని పట్ట భద్రులతో బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నా రెడ్డి దయాకర్ రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మం డల అధ్యక్షులు దూడల పెం చలయ్య ,జిల్లా కార్య వర్గ సభ్యులు సామర్లజయ సింహ, కిసాన్ మోర్చా అధ్యక్షులు మాదిరెడ్డి ఆదిరెడ్డి, మండల మహిళా మో ర్చాఅధ్యక్షురాలు ఎగురు కృపావతి పాల్గొన్నారు.

# తారకరత్నకు ఘన నివాళులు

**విశాలాంధ్ర-రాపూరు:** టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారక రామా రావు మనవడు నందమూ రి తారకరత్న గుండె పోటుతో అకాల మరణం చెందడం తో టిడిపి వెంకటగిరి ఇంచార్జ్ కురుగొండ్ల రామకృష్ణ ఆదేశాల మేరకు రాపూరు పట్టణంలో సోమవా రం తిరుపతి పార్లమెంట్ జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు షేక్ ముక్తార్ ఆధ్వర్యంలో తారక రత్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో సీనియర్ టిడిపి నాయకులు పట్టణ ఉపాధ్యక్షులు డాక్టర్ గజరా వేణుగోపాల్, సంకల పాపయ్య, షేక్ గౌస్ మొహద్దిన్ సయ్యద్ మహబూబ్ బాషా రాపూరు మండల మైనార్టీ అ ధ్యక్షులు గౌస్ బాష, సిహెచ్ మహేష్, కె బాలయ్య, ఎస్.కె అఫ్రోజ్, ఎస్.కె రసూల్ మహిళా నాయకురాలు సయ్యద్ జ్యోతి, పటాన్ ఖలీల్, బత్తల సాయికు మార్, శ్రీపురం రాజా,సుదర్శన్ రాజు, అల్లం రాఘవ, పటాల పాపయ్య, పరంధామరెడ్డి, మాదమాల నరసింహారెడ్డి, కృష్ణయ్య, హరి , టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళుల ర్పించారు.

# దోమల నిర్మూలనకు చర్యలు

**విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్:** దోమల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకుంటున్నామని నెల్లూరు కార్పొరేషన్, రూరల్ నియోజకవర్గం పరిధిలోని 41 వ డివిజన్ కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గ ఇన్చార్జ్, ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి సూచనల మేరకు డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప, శివగిరి కాలనీ ప్రాంతాల్లో సోమవారం కార్పొరేటర్ కువ్వాకొల్లు విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ విజయలక్ష్మి దృష్టికి తీసుకు వచ్చారు. ఆమె స్పందించి నెల్లూరు కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులతో చర్చించి తమ డివిజన్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వ హణకు శ్రీకారం చుట్టారు. కాలువలు పూడిపోయి మురుగు మీరు ముందు కు కదలకపోవడంతో దోమలు ప్రబలి వ్యాధులను వ్యాపింప చేస్తున్నా యని కార్పొరేటర్ విజయలక్ష్మి దృష్టికి వచ్చింది. దాంతో ఆమె రంగంలోకి దిగి ఆయా ప్రాంతాల్లో కాలువల్లో పూడిక తీయించారు. దోమలు ప్రబలకుండా దోమల నిర్మూలన ముందు పిచికారి చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్లో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకువస్తే రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆదాల ప్రభాకర్ రెడ్డి సహకారంతో పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానికులు ఏడు కొండలు, రంగయ్య, ఈశ్వరమ్మ, సురేష్, యశ్వంత్, వంశి పాల్గొన్నారు.

# 'మా నమ్మకం.. నువ్వే జగన్' లో మంత్రి కాకాణి

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, చెముడుగుంటలోని శ్రిడ్స్ కళ్యాణ మండపంలో నిర్వహించిన "మా నమ్మకం.. నువ్వే జగన్" కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖా మాత్యులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. గృహ సారథులు వైసీపీ నేతలు ప్రతి గడపకు వెళ్లాలి...గత ప్రభుత్వంలో ఏం చేసింది.. మన ప్రభుత్వంలో ఏం చేస్తున్నాము? అనే తేడాను ప్రజలకు వివరించి, వారి మద్దతు కోరాలని మంత్రి సూచించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. 'మా నమ్మకం... నువ్వే జగన్" కార్యక్రమంలో భాగంగా నూతనంగా తయారుచేసిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేయాలని మంత్రి సూచించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ప్రజలందరూ వైసీపీకి మద్దతుగా ఉన్నారని ఆంధ్ర రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోతారని మంత్రి కాకాణి ప్రకటించారు.

# వైభవంగా రథోత్సవం

**విశాలాంధ్ర- నెల్లూరు:** గండవరం గ్రామం లోని శ్రీ పద్మావతి సమేత శ్రీ ఉదయ కాళేశ్వర దేవస్థానంలో సోమవారం రథోత్సవం వైభవం గా జరిగింది. స్థానిక తహశీల్దార్ రమాదేవి రథోత్స వానికి జండాను ఊపి ప్రారంభించారు. జిల్లా లోని నలుమూలల నుంచి వచ్చిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని కొబ్బరి కాయలు, గుమ్మడి కాయలు కొట్టి పూజలు నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రతిఏటా ఈ కార్యక్రమాలు నిర్వహించడం అనవయితీగా వస్తుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా గ్రామంఅంతా శివనామస్మరణలతో మార్మోగి పోయింది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం లో డిసియంయస్ చైర్మన్ వీరి చలపతి రావు, వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బాధ్యతలు చేపట్టిన ఎస్ఐకి శుభాకాంక్షలు.. డైరీ అందజేత

**విశాలాంధ్ర- నెల్లూరు:** జలదంకి జలదంకి పోలీసు స్టేషన్లో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన జి వీరేంద్ర బాబును సోమవారం మర్యాదపూర్వకంగా కలసి డిహెచ్ పిఎస్ డైరీని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు, డి రమేష్ కుమార్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ అసాంఘిక కార్యకలాపాలు, జూదం, అక్రమ మద్యం విక్రయం తదితర వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు.

# సిద్ధేశ్వరునికి అన్నాభిషేకం

**విశాలాంధ్ర- ముత్తుకూరు :** కృష్ణపట్నం గ్రామంలోని శ్రీ మనుమ సిద్దేశ్వర ఆలయంలో సోమవారం స్వామివారికి అన్నాభి షేకం నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భం గా ఈ ఆలయంలో మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆలయ ఈవో సుధాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారికి శాంతి హోమం, అమ్మవారికి లక్ష కుంకుమార్చన, మూలవిరాట్ కు అన్నాభిషేకం చేశామన్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమానికి సుమారు 4 వేల మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. శివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించిన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు ఏర్పాటు చేశారని భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు కూడా చేశారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు మూడు రోజులు పాటు నిర్వహించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెదపాలెం సుబ్బయ్య, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మాతృభాష పరిరక్షణ, పరి వ్యాప్తి సంకల్పం కావాలి

## - నెల్లూరు రచయితల సంఘం

**విశాలాంధ్ర బ్యూరో- నెల్లూరు:** అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీ కస్తూరి దేవీ పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం తెలుగు తల్లి చిత్రపటానికి నివాళు లు, వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులు బహుమతుల అందజేత, మాతృభాష పరిరక్షణ, పరి వ్యాప్తిని ప్రజలు సంక ల్పంగా తీసుకోవాలని, అప్పుడే మన భాష, సంస్కృ తులను కాపాడుకోగలమని నెల్లూరు రచయిత సంఘం పిలుపు నిచ్చింది. ఫిబ్రవరి 21 మంగళవారం నాడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్క రించుకుని సోమవారం కస్తూరి దేవి పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాషా సమితి అధ్యక్షులు చలంచర్ల భాస్కర్ మాట్లా డుతూ అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ నేపథ్యాన్ని వివరించాలి. బంగ్లాదేశ్ ప్రజలు మాతృభాష కోసం పోరాడి అమరులై, ప్రపంచంలో స్ఫూర్తిని నింపారని, దాని కారణం గానే యునెస్కో అంతర్జా తీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రకటించిందని తెలిపారు. మాతృభాషను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ఉద్యుక్తులు కావా లని ఆకాంక్షించారు. భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పురవస్తు నాగసాయి సూరి మాట్లా డుతూ ప్రపంచం లో 6000 కు పైగా భాషలు ఉన్నప్పటికీ, అందులో 40 శాతం భాషల్లో వాటిని మాట్లాడే ప్రజలు విద్యను అందు కోలేకపోతున్నారని తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే అనేక భాషలు అంతర్ధానమయ్యే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో మన భాషా, సంస్కృ తులను కాపాడుకోవలసిన అవసరం ఉందని, యువతరం ఈ దిశగా నడుం బిగించాలని ఆకాం క్షిం చారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్ మాట్లా డుతూ ప్రస్తుతం తెలుగు భాష అనేక విధాలుగా సమస్యలు ఎదుర్కొంటోందని, ఈ పరిస్థితిలో మార్పు రావలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాతృ భాష పరిరక్షణ కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ముందుకు రావాలన్నారు. ముఖ్యంగా విద్యా ర్థులు అమ్మలాంటి మాతృ భాషలోని మాధు ర్యాన్ని ఆస్వాదిం చటంతో పాటు, ముందు తరా లకు బహుమతిగా అందజే యాలని సూచిం చారు. నెల్లూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ మాట్లా డుతూ తెలుగు భాష ఎంతో మధురమైందని, ఇలాంటి భాషకు వార సులం అయి నందకు గర్వించాలని తెలిపారు. భాషను కాపాడుకోవటం మాత్రమే కాదని, ఇంతటి గొప్ప భాషలోని సాహిత్యాన్ని యువత చదివే ప్రయత్నం చేయాలని సూచించారు. అంత ర్జాతీయ మాతృభాష దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అంతకు ముందు తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో కరి మద్దెల నరసిం హారెడ్డి, వేదం సూర్యప్రకాష్, రూడ్స్ సంస్థ చైర్మన్ రసూల్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వనజ, నజ్మా, అరుణ, భారతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొ న్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# సిజెఎఫ్ఎస్ భూములు లీజుదారు అదీనమా?: ఎంఆర్పీఎస్

**విశాలాంధ్ర-రాపూరు:** రాపూరు మేజర్ పంచాయతీ లోని బిట్ 3 పరిధి లోని మద్దుల మడుగులోని గూడూరు -వెంకటగిరి రూట్ లో సర్వేనెంబర్ 1080 లో గతంలో ఎస్ సి లకు ఇచ్చిన సిజెఎఫ్ఎస్ ఆర్డీఓ భూముల ను 2011-12 లో అప్పటి అర్డీ ఓ మాధవీలత గురుకుల పాఠశాల కు ఆ భూములు లీజు దారులనుండి తీసుకొని ప్రభుత్వ భూములుగా ప్రకటించి ఆ భూములు రెవెన్యూ అధీనంలో వున్నాయని, కాని ఆ భూమి లో గురుకుల పాఠశాల నిర్మాణం చేయలేదని అభూములకు చెందిన లబ్ధిదారులను 2012- 13 సంబీలో ఎంపి ఎంఆర్ పిఎస్ అధ్వర్యాంలో నెల్లూరుఆర్డిఓ,జె సి వద్దకు తీసుకు పోయి పెదల కు ఇచ్చిన భూములనుతెలియ కుండా,కనీసం నోటీసులు కూ డా ఇవ్వకుండా రద్దు చేయడం అన్యాయమని,వారికి ప్రత్యా మ్నాయంగా ప్రభుత్వం భూమి లను గుర్తించి పట్టాలు ఇవ్వాలని ఎంఆర్పిఎస్ నాయకులు కోరారు. సిజెఎఫ్ఎస్ భూములు ప్రభుత్వానికి అవసరమైనప్పుడు తీసుకుంటామని,వాటికి నోటీసులు ఇవ్వవలసిన అవ సరం లేదని ఎక్కడైనా ఆ ప్రాం తంలో ప్రభుత్వం భూములున్న ఎంఆర్ఓ కు చెపుతామని మీకు న్యాయం చేస్తామని చెప్పారన్నారు. అప్పట్లో అభూములు గుండా కృష్ణపట్నం-ఓబులా పురం రైల్వే లైన్ వేసినప్పటికీ ఈ భూములిచ్చిన లబ్ధిదారుల కు నష్టపరిహారం ఇవ్వలేదని,అ ప్పటికె అభూములు ప్రభుత్వ భూములుగా గుర్తించారని అయితే

రాపూరు-గూడూరురూట్లో సర్వేనెంబర్ 1080 లో విలేకరులకు, మరికొందరికి 32 మందికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చిందన్నారు. అభూములు ఇప్పుడు ఏ సంబంధం లేని ఒక వ్యక్తి ఆక్రమించి దీన్ని మామిడి చెట్లు వేశాడన్నారు. సదరు వ్యక్తిని విచారించి, నివాస స్థలాలు ఇచ్చిన వారికి న్యాయం చేయాలని ఏపి ఎంఆర్పిఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, వెంకటగిరి నియోజక వర్గ ఇన్చార్జి కొండపురం వేంకటేశ్వర్లు తహశీల్దారు సుభాషిణికి వినతిపత్రం అందించారని తెలిపారు. వీరి తో పాటు ఏపి ఎంఆర్పిఎస్ మండల కన్వీనర్ ఏసి పోగు చిట్టిబాబు,జిల్లా ఉపాధ్యక్షుడు కదిరి వేంకటేశ్వర్లు, మండల నాయకులు నల్లగల శ్రీహరి పాల్గొన్నారు.